# కంటి వైద్య శిబిరం పోస్టర్ ఆవిష్కరణ



కంటి వైద్య శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

వనపర్తి టౌన్, మే 31 : జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిభిరాన్ని నిర్వహిస్తున్నారని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం పోస్టర్‌ను బీఆర్‌ఎస్ నాయకలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షుడు మాధవరావు సునీల్ వాల్మీకి ఆధ్వర్యంలో శ్రీసాయి నేత్రాలయ కంటి దవాఖాన సంయుక్తంగా కంటి వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. జూన్ 2వ తేదీ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జిల్లా కేంద్రంలోని 20వ వార్డు గాంధీనగర్ అభయాంజనేయ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మీడియా సెల్ కన్వీనర్ నందిమల్ల అశోక్, నాయకులు లక్ష్మారెడ్డి, మాణిక్యం, కృష్ణయ్యరెడ్డి, డేగ మహేశ్వర్, తిరుపతయ్యయాదవ్, ధర్మనాయక్, గిరి, జోహెబ్ హుస్సేన్, సునీల్, చిట్యాల రాము, అలీం, యుగంధర్‌రెడ్డి, సయ్యద్ జమీల్, జహంగీర్, కుమ్మరి సత్యం, నాయక్, నర్సింహ, కరుణాకర్, బాలరాజు, మునికుమార్, రామస్వామి, నందిమల్ల సుబ్బు, సామ్యానాయక్ పాల్గొన్నారు.

# రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తే చర్యలు



గోపాల్‌పేట ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

- **అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు**

గోపాల్‌పేట/ రేవల్లి, మే 31 : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి లారీ డ్రైవర్లు, యజమానులు ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శనివారం ఆయన గోపాల్‌పేట మండల కేంద్రంతోపాటు చాకల్‌పల్లి, ఏదుల మండలంలోని చీర్కపల్లి, గొల్లపల్లి, రేవల్లి మండలంలో తల్పునూర్, రేవల్లి, చీర్కపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి గింజా కొనుగోలు చేస్తామన్నారు. త్వరలో ధాన్యం తరలించే ప్రక్రియను వేగవంతం చేస్తామని, ఎక్కువ సంఖ్యలో లారీలను అందుబాటులో తీసుకొచ్చి ధాన్యం తరలిపోయేలా చూస్తామన్నారు. ధాన్యంపై టార్పాలిన్‌లు కప్పి వర్షం నుంచి కాపాడుకోవాలని రైతులకు సూచించారు. రైతులు ఎవరికీ ఎటువంటి అదనపు డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని ఆయన పునరుద్ఘాటించారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరతో విక్రయించుకోవాలని సూచించారు. రైతుల ప్రయోజనాలు కాపాడటానికి జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని తెలిపారు.

# ఆర్థిక వ్యవహారాలపై అవగాహన పెంచుకోవాలి

- **మహిళా సాధికారత కేంద్రం స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షియల్ లిటరసీ సుమ**



ఉపాధి కూలీలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మహిళా సాధికారత కేంద్రం స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షియల్ లిటరసీ సుమ

పెద్దమందడి, మే 31 : ప్రజలు ఆర్థిక వ్యవహారాలపై అవగాహన పెంచుకోవడంతోపాటు కుటుంబ పోషణ, వ్యాపారాలు, ఇతర క్రమశిక్షణణ పాటిస్తూ పొదుపుకోసం కృషి చేయాలని మహిళా సాధికారత కేంద్రం స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షియల్ లిటరసీ సుమ అన్నారు. శనివారం మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి సూచనల మేరకు మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యం లో మండలంలోని దొడగుంటపల్లిలో ఉపాధి హామీ కార్మికులకు ఆర్థిక అక్షరాస్యత, బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందించే అన్ని రకాల పథకాలు, రుణాలు, బీమా సదుపాయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వాలు తక్కువ వడ్డీకే రుణాలను అందిస్తాయని రైతులు, మహిళలు బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారికి వివరించారు. అదేవిధంగా సైబర్‌క్రైమ్, బాలల చట్టాలు, చైల్డ్ లేబర్, బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించి బాల్య వివాహ రహిత సమాజానికి కృషి చేస్తామని ఉపాధి కూలీలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రశేఖర్ గౌడ్, శాంతన్న, ఉపాధిహామీ కార్మికులు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**FINANCE**
★Project Finance... MSME, CGTSME, Seed Funding, Private Equity, Venture Capital, Laisoning Services @ KPHB. 7032631468.
NT-350515-All

**WANTED**
★AN Infra DVLP సంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్స్ కావలెను. యాదాద్రి సమీపంలో వెంచర్లకు @ రాక్‌టౌన్ కాలనీ, అలకాపురి, L.B.Nagar, హైదరాబాద్. సంప్ర: 9989747788.
NT-325337-All

**ప్రకటన**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

# చినుకుపడితే అంధకారమే..

- **కరెంట్ కష్టాలతో గ్రామస్తులు**
- **పేరుకుపోయిన డ్రైనేజీ**
- **నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు**



పైపాడు గ్రామం వ్యూ



శిథిలావస్థకు చేరిన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె

వడ్డేపల్లి, మే 31: పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంలా మున్సిపాలిటీలో ఈ మధ్యే కలిసిన పైపాడు గ్రామం కష్టాలతో కొట్టు మిట్టాడుతున్నది. పేరుకే మున్సిపాలిటీ కాని వార్డుల్లో ప్రజలు వివిధ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. ముఖ్యంగా చిన్నపాటి చినుకుపడితే గ్రామంలో కరెంట్ పోతుందని, గ్రామంలో పూర్వం వేసిన పాత విద్యుత్ స్తంభాలే చాలా మటుకు ఉన్నాయని, కొత్త స్తంభాలు వేసి, కొత్త తీగలను వేయాలని కోరుతున్నారు. గాలులకు పొలాల్లో చెట్లు తీగలకు తగిలితే విద్యుత్ సరఫరా బంద్ అవుతుందని, రాత్రి వేళలో సమస్యను విద్యుత్ సిబ్బంది గుర్తించడం కష్టమవుతుందని అంటున్నారు. టూ ఫేస్ ద్వారా ఇస్తే సమస్య ఉందని , ఇచ్చే అవకాశం ఉన్న విద్యుత్ సిబ్బంది అటువైపుగా ఆలోచించడం లేదని, ఒకరోజు ట్రైల్ వేశారని అప్పుడు కరెంట్‌కు అంతరాయం కలగలేదని కాలనీవాసులు అభిప్రాయపడుతున్నారు. పూర్వం ఎప్పుడో నిర్మించిన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెలు కూలి పోవడానికి సిద్ధంగా ఉన్నవాటిని గుర్తించి మరమ్మతులు చేయాలని లేకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. గ్రామంలో కొన్ని కాలనీలకే సీసీరోడ్లు ఉన్నాయని, మున్సిపాలిటీలో కలిపినందుకు మొదట సంతోషం వేసినా పన్నుల మోత, ఎక్కడ లేని నిబంధనలతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి చిన్న పనికి మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లి మున్సిపాలిటీ కేంద్రానికి పోవాల్సి వస్తుందని, గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్దకు వారంలో రెండురోజులైనా కమిషనర్ వచ్చేలా చూడాని కోరుతున్నారు.



వీధుల్లో పెరుకపోయిన మురుగు

### కరెంట్ సమస్యకు పరిష్కారం చూపాలి



పాతపడిన కరెంట్ వైర్లు, పాతపడిన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెలు, పాతస్తంభాలు, మురుగునిండిన కాల్వలు, మరోవైపు పన్నుల దెబ్బలు, ఎవరికీ తెలియని ప్రభుత్వ పథకాలు, అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండి వివిధ సమస్యలతో నిండిపోయిన పైపాడును అధికారులు పట్టించుకోవాలి. వర్షాకాలంలో కరెంట్ కష్టాలు ముఖ్యంగా తీర్చాలి.

–వెంకటేశ్వర్లు, పైపాడు గ్రామం

### రాత్రిళ్లు నిద్రలేకుండా గడుపుతున్నాం..



ఇందిరమ్మ ఇండ్లు ఎవరికి వస్తాయో ఎంతమందికి వస్తాయో అయోమయంగా ఉంది. అర్హులు ఎంతో మంది ఉన్నప్పటికీ పింఛన్లు రావడంలేదు. కరెంట్ పోతే రాత్రిళ్లు నిద్ర లేకుండా గడుపుతున్నాం. అధికారులు వారంలో రెండు సార్లయినా గ్రామానికి రావాలి. అప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయి.

–సంజన్న, పైపాడు గ్రామం

# రాష్ట్ర అవతరణ దినోత్సవానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- **అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ**



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

గద్వాల, మే 31 : జూన్ 2 రాష్ట్రఅవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జూన్ 2న నిర్వహించే రాష్ట్రఅవతరణ దినోత్సవ వేడు కల సందర్భంగా వివిధ శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రఅవతరణ సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో ఉదయం 10గంటలకు నిర్వహించే అవతరణ దినోత్స వేడుకల్లో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారిగా దిశా నిర్దేశం చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా వివిధ శాఖలు ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. పట్టణ కేంద్రంలోని స్మృతి వనం, పాతబస్‌స్టాండ్ వద్ద గల తెలంగాణ పోరాట యోధుల విగ్రహాల వద్ద, సభాస్థలి వేదికలను పూలతో అలంకరించాలని కోరారు. పోలీస్ గౌరవ వందనంతోపాటు వేడుకల్లో పోలీస్ బందోబస్త్ ఏర్పాట్లు చేయాలన్నారు. బాలభవన్ పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారికి ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, ఏవో భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

# పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

- **జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత**

వనపర్తి టౌన్, మే 31 : పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని, ఇలాంటి వ్యసనాల వల్ల కుటుంబాలు ఎన్నో వీదిన పడ్డాయని వనపర్తి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్. సునీత అన్నారు. శనివారం ప్రపంచ పొగాకు రహిత దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పొగాకు దూరంగా ఉండి సమాజానికి ఆదర్శవంతులుగా ఉండాలని సూచించారు. ధూమపానం చేయమని, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటామని, మా కుటుంబ సభ్యులను, స్నేహితులను పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంచడానికి ప్రేరేపిస్తామని న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమం లో సీనియర్ సివిల్ జడ్జి కళార్చన, జూనియర్ సివిల్ జడ్జి శ్రీలత , కోర్టు సిబ్బంది ఉన్నారు.

### లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

వనపర్తి టౌన్, మే 31 : జూన్ 14వ తేదీన జిల్లా కోర్టులో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.ఆర్ సునీత అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జి కార్యదర్శి కళార్చనతో కలిసి ప్రధాన న్యాయమూర్తి మాట్లాడారు. జిల్లా కోర్టులో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి అనుకూలమైన సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. జాతీయ లోక్ అదాలత్‌తో ఇచ్చే తీర్పు సుప్రీం కోర్టు తీర్పుతో సమానమన్నారు. లోక్ అదాలత్‌తో రాజీ చేయదగిన కేసులన్ని పరిష్కరిస్తామన్నారు. తీర్పు వల్ల కక్షిదారుడు ఒక్కరే విజయం సాధిస్తే లోక్ అదాలత్‌తో ఇరువర్గాలు రాజీ కావడంతో ఇరువురు విజయం సాధించినట్లేనని పేర్కొన్నారు. సివిల్ కేసుల్లో రాజీ పడితే కోర్టు ఖర్చులు వాపస్ చేస్తామన్నారు.





అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

# ధూమపానంతో జీవితం దహనం



గద్వాలలో డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గద్వాల టౌన్, మే 31 : ధూమపానం ఆరోగ్యంతోపాటు జీవనాన్ని దహనం చేస్తుందని సైకియాట్రిస్టు ప్రదీప్‌కుమార్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధూమపానానికి దూరంగా ఉండాలని కోరారు. కుటుంబంలో ఒకరు ధూమపానానికి బానిసైతే ఆ కుటుంబమంతా బాధపడాల్సి వస్తుందన్నారు. ధూమపానం కారణంగా ప్రతి ఏడాది 80లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. కుటుంబం, సమాజం ఆరోగ్యంగా ఉండాలంటే ధూమపానానికి స్వస్తి పలకాలన్నారు. కార్యక్రమంలో ఎన్సీడీ కో ఆర్డినేటర్ శ్యామ్‌సుందర్, సుబ్బలక్ష్మి, శ్రీలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు. అలాగే బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో మున్సిపాలిటి పరిధిలో, రైల్వే స్టేషన్‌లో ప్రజలకు ధూమపానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ దశరథ్, రైల్వే ఆర్‌పీఎఫ్ ఏఎస్సై మహ్మద్ అసదుల్లా ధూమపానం వల్ల కలిగే అనర్థాలను, తీసుకోవాల్సిన నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి మంజుల, మున్సిపల్ అధికారులు, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

మల్దకల్, మే 31 : సిగరేట్, బీడి, జర్దా, గుట్కా వీటిలో నికోటిక్ అలాగే ప్రాణహాని కల్గించే రసాయనాలు ఎక్కువగా ఉంటాయని అందుకని వీటికి ప్రజలు దూరంగా ఉండాలని మండల వైద్యాకారిణి స్వరూపారాణి అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ సందర్భంగా రోగులతోపాటు ప్రజలతో మాట్లాడారు. సిగరేట్, జర్దా, బీడి తదితర వాటిని తాగడం వల్ల మనిషిలోని శ్వాసకోశ , మూత్ర పిండాల వ్యాధుల బారిన పడి మరణించే అవకాశం ఉందన్నారు. అలాగే పొగాకు ఉత్పత్తులు సేవించే వారికి టీబీ వ్యాధి, ముఖ్యంగా సంతాన లేమి సమస్యలు వస్తాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీధర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

ఖిల్లాఘణపురం, మే 31: సీసీ కెమెరాల ఏర్పాటు కోసం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కూచూరు లక్ష్మారెడ్డి తన వంతుగా శనివారం ఎస్సై సురేశ్‌గౌడ్‌కు రూ.10వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై సురేశ్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటుకు దాతలు ముందుకురావాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పా టుకు విరాళం అందజేసిన లక్ష్మారెడ్డికి ఎస్సై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్సై సత్యంగౌడ్, మాజీ జెడ్పీటీసీ సామ్యనాయక్ , పోలీస్ సిబ్బంది ఉన్నారు.

### నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

అమరచింత, మే 31: రైతులకు నకిలీ విత్తనాలను, మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు దుకాణం లైసెన్స్‌ను రద్దు చేస్తామని ఎస్సై సురేశ్ ఎరువుల దుకాణ యజమానులను హెచ్చరించారు. శనివారం ఆయన మండలంలోని ఈర్లదిన్నెలో వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ దుకాణాన్ని తనిఖీ చేసి ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది అరవింద్, పాషా, రవి ఉన్నారు.

### జీలుగ విత్తనాలతో పొలానికి సత్తువ

పెబ్బేరు, మే 31: జీలుగ విత్తనాలు పొలానికి సత్తువతోపాటు పునరుత్తేజాన్ని ఇస్తాయని, ప్రభుత్వం 50శాతం సబ్సిడీ ద్వారా పంపిణీ చేస్తున్న వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీరంగాపురం సింగిల్ విండో అధ్యక్షుడు జగన్నాథంనాయుడు అన్నారు. శనివారం సింగిల్ విండో కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వానకాలంలో పొలం ఖాళీగా ఉంచి యాసంగిలో మినుములు తదితర పంటలు వేయాలనుకున్న రైతులు, వరి పంట వేసే వారు జీలుగ విత్తనాలు వేసుకోవచ్చన్నారు. కావాల్సిన రైతులు రైతు పాస్ బుక్కు, ఆధార్ జిరాక్స్‌లతో రైతువేదిక వద్దకు వచ్చి పర్మిట్ తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి హైమావతి, సింగిల్ విండో సీఈవో శివకుమార్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

# ప్రజలకు సేవలందించడంలోనే ఉద్యోగికి సంతృప్తి

- **అదనపు కలెక్టర్ నర్సింగరావు**



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

అయిజ, మే 31 : ప్రజలు అహర్నిషలు సేవలందించడంలోనే ఉద్యోగికి సంతృప్తి కలుగుతుందని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. శనివారం అయిజ ఎంపీడీవో వెంకటయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉద్యోగులకు బదిలీలు సాధారణమని, కానీ ఎన్నటికైనా ఉద్యోగ విరమణ తప్పదన్నారు. సాధారణ ఎన్నికల వేళ నారాయణపేట నుంచి అయిజకు బదిలీపై వచ్చిన ఎంపీడీవో వెంకటయ్య అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో ప్రముఖపాత్ర పోషించాడన్నారు. దాదాపు రెండేళ్లుగా అయిజ మండలాభివృద్ధిలో తన వంతు కృషి చేశాడని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం పలువురు ఉద్యోగులు ఎంపీడీవోను సన్మానించారు. కార్యక్రమంలో డీపీవో నాగేంద్రం, తాసీల్దార్ జ్యోతి, ఎంఈవో రాములు, రెడ్‌క్రాస్ జిల్లా వైస్‌చైర్మన్ తాహేర్ పాల్గొన్నారు.

### మొక్కల పెంపకంపై అవగాహన

ఎర్రవల్లి చౌరస్తా, మే 31 : మండలంలోని కోదండాపూర్, పుటాన్‌దొడ్డి గ్రామంలో రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో భాగంగా పాలెం వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు డా.శ్రీధర్, డాక్టర్ జీ.ఈశ్వర్‌రెడ్డి, వ్యవసాయ అధికారి రవికుమార్, ఉద్యాన అధికారి ఇమ్రాన్ మాట్లాడుతూ.. వర్షాధార వ్యవసాయంలో నీటిని సంరక్షించే చర్యల గురించి, పంట మార్పిడితో కలిగే ప్రయోజనాలు, చెట్లపెంపకం వల్ల కలిగే లాభాలు, వ్యవసాయం కోసం వాడే రసాయనాల గురించి, ప్రస్తుతం వ్యవసాయం కోసం అమలవుతున్న పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవోలు హిమబిందు, సంధ్యా, ప్రవళిక, మానస, నరేశ్, రామకృష్ణ, గ్రామస్తులు రైతులు పాల్గొన్నారు.

### అంటరాని తనం నేరం

మల్దకల్, మే 31 : మండలంలోని కుర్తిరావుల చెర్వు గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని రెవెన్యూ అధికారులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ మధు మాట్లాడుతూ గ్రామంలో అన్ని కులాలు, మతాలు కలిసి మెలిసి జీవించాలన్నారు. అలాగే గ్రామంలోని హోటళ్లల్లో రెండు గ్లాసుల పద్ధతిని అవలంభించ కూడదన్నారు. ముఖ్యంగా దళితులపై వివక్ష చూపకూడదన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలు, పెద్దలు పాల్గొన్నారు.

### వ్యాధులు రాకుండా టీకాలు వేయాలి

ఎర్రవల్లి చౌరస్తా, మే 31 : సీజనల్ వ్యాధులు రాకుండా జీవాలకు టీకాలు వేయించాలని రైతులకు పశువైద్యురాలు డా.భువనేశ్వరి సూచించారు. ఈ సందర్భంగా డా.భువనేశ్వరి మాట్లాడుతూ పశువుల్లో వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు జబ్బువాపు, గొంతువాపు, ముద్దచర్మవ్యాధి, రాకుండా ముందస్తుగా వ్యాధినిరోధక టీకాల పంపిణీ కార్యక్రమం నేటినుంచి వచ్చేనెల జూన్26వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. శనివారం ఎర్రవల్లి,పుటాన్‌దొడ్డి గ్రామాల్లో మొత్తం 192 గేదెలు,114 ఆవులకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వినయ్‌కుమార్, మాసుమన్న, సబినా తదితరులు పాల్గొన్నారు.

### గద్వాల ఆర్డీవోగా అలివేలు

గద్వాల అర్బన్, మే 31 : గద్వాల ఆర్డీవోగా అలివేలును నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. గతంలో ఆర్డీవో విధులు నిర్వర్తించిన శ్రీనువాసులు ఇరిగేషన్ శాఖలో విధులు నిర్వరిస్తూ ఆర్డీవోగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించారు. అలివేలు వరంగల్ కమిషనర్ కార్యాలయంలో విధులు నిర్వరిస్తూ బదిలీపై గద్వాలకు వచ్చినట్లు కలెక్టరేట్ కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి. రెండు, మూడు రోజుల్లో గద్వాల ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని సమాచారం.

### 3 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు

వనపర్తి టౌన్, మే 31 : జూన్ 3 నుంచి 6వ తేదీ వరకు ఇంటర్ సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు జరుగనున్నాయని జిల్లా ఇంటర్ విద్యాధికారి ఎర్ర అంజయ్య శనివారం ప్రకటనలో చెప్పారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ,ప్రభుత్వ సెక్టార్ ప్రైవేట్ కళాశాలల్లో చదివి సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించిన విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా అన్ని కళాశాలల విద్యార్థులకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. 3 నుంచి 6వ తేదీ వరకు బాటని, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రి పరీక్షలు జరుగుతాయని చెప్పారు. అదేవిధంగా జూన్ 9, 10న ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్షలు, జూన్ 11న పర్యావరణ–విద్య పరీక్ష, జూన్ 12న నైతికత, మానవ విలువలు పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్‌ను కళాశాలలో లేదా ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని చెప్పారు. హాల్‌టికెట్‌తో సమయానికి పరీక్ష సెంటర్‌కు హాజరు కావాలని డీఐఈవో ఎర్ర అంజయ్య విద్యార్థులకు సూచించారు.

### దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి టౌన్, మే 31 : సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకంలో భాగంగా విదేశీ విద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే మైనార్టీ విద్యార్థుల నుంచి వీదేశీ ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఎండీ అఫ్జలుద్దీన్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా www.telangan aepass.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని, కుటుంబ ఆదాయం సంవత్సరానికి రూ.5లక్షల లోపు ఉండాలని, ఎంపి కైన విద్యార్థులకు రూ.20లక్షల ఉపకార వేతనంతోపాటు విమాన ప్రయాణం ఖర్చులకు రూ.60వేలు అందజేస్తారని తెలిపారు. ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత హార్డ్ కాపీలను గెజిటెడ్ చేసి రెండు సెట్లను కలెక్టర్ కార్యాలయంలో రూమ్ నెంబర్ 207లో జూన్ 30వ తేదీలోగా అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయం 7207854914, 08545232500 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

### ఉపకార వేతనాలకు..

గద్వాల అర్బన్, మే 31 : 2024–25 విద్యా సంవత్సరానికి గానూ పోస్టు మెట్రిక్ ఉపకార వేతనల కోసం దరఖాస్తులు ఆహ్వానించారని, దీని గడువు జూన్ 30వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సరోజ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు వారి అర్హతను బట్టి పోస్టు మెట్రిక్ కోర్సులు చదువుతున్న ఫ్రెష్, రెన్యూవల్ విద్యార్థులు అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ విషయాన్ని ప్రభుత్వ కాలేజీ ప్రిన్సిపాల్, ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలు తమ విద్యార్థుల వివరాలను నమోదు చేయించాలని తెలిపారు.

### బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకి..

గద్వాల అర్బన్, మే 31 : జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో ఎస్సీ కులానికి చెందిన విద్యార్థుల నుంచి 1 నుంచి 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సరోజ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఒకటో తరగతి చేరేందుకు జూన్ 1, 2019 నుంచి మే, 31, 2020లో మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. అలాగే 4,5 తరగతి చదివే విద్యార్థులు సర్టిఫికెట్లు, ఆధార్, రేషన్ కార్డు, బోనఫైడ్ తదితర ధ్రువీకరణ పత్రాలు అందజేయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పట్టణం వారికి రూ.2లక్షలు, గ్రామీణ ప్రాంతంలోనికి వారికి రూ.1,50,000 ఉన్న వారు దరఖాస్తును జూన్ 16వ తేదీలోగా జిల్లా షెడ్యూల్డ్ కులాల కార్యాలయంలో అందజేయాలన్నారు. ప్రతి కుటుంబం నుంచి ఒక్కరికి మాత్రమే అర్హత ఉంటుందన్నారు.

### టెండర్లకు ఆహ్వానం

వనపర్తి టౌన్, మే 31 : వనపర్తి ఆర్టీసీ డిపో పరిధిలోని వనపర్తి, పెబ్బేరు బస్‌స్టేషన్‌ల్లోని స్థలాల్లో వ్యాపారాలు నిర్వహించేందుకు ఈ–టెండర్లు ఆహ్వానిస్తున్నామని డీపో మేనేజర్ శనివారం ప్రకటనలో తెలిపారు. టెండర్ ఫారాలు జూన్ 4వతేదీ వరకు డిపో మేనేజర్ ఆఫీసులో పొందవచ్చని ఆయన తెలిపారు. టెండర్‌లో పాల్గొనేవారు అకౌంట్ ఆఫీసర్, టీఏస్ఆర్‌టీసీ, మహబూబ్‌నగర్ రీజిఎన్ పేరున డీడీలు తీయాలన్నారు. జూన్ 4వ తేదీన సాయంత్రం 5గంటలలోగా బిడ్ అందజేయాలని, హార్డ్ కాపీలను 5వ తేదీ 11గంటల వరకు అందజేయాలన్నారు. టెక్నికల్ ఓపెనింగ్ అదే రోజు మధ్యాహ్నం 3గంటల నుంచి ఉంటుందని, కమర్షియల్ బిడ్ ఓపెనింగ్ సాయంత్రం 5గంటలకు ఉంటుందని చెప్పారు. టెండర్‌లో పాల్గొనదలచిన వారు నిర్మించే స్టాల్స్ యొక్క ప్రదేశాలను ముందుగా చూసి సంతృప్తి చెంది ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టెండర్ ప్రక్రియను వాయిదా వేయడానికి లేదా రద్దు చేసేందుకు టెండర్ కమిటీకి పూర్తి అధికారం ఉంటుందని చెప్పారు. వివరాలకు 9959226289, 7382829092, 9494019474 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

### పెబ్బేరులో భూ భారతి సదస్సులు

పెబ్బేరు, మే 31: పెబ్బేరు మండలంలో వచ్చేనెల 3వ తేదీ నుంచి భూ భారతి సదస్సులు నిర్వహిస్తున్నట్లు తాసీల్దార్ మురళి శనివారం ప్రకటనలో తెలిపారు. గ్రామాల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి. 3వ తేదీన అయ్యవారిపల్లె, జనుంపల్లి, 4న రంగాపురం, కంచిరావుపల్లి, 5న రంగాపురం, పెంచికలపాడు, 6న బునియాదిపురం, రామమ్మపేట, 9న గుమ్మడం, రాంపురం, 10న గుమ్మడం, శాఖాపురం, 11న బూడిదపాడు, తోమాలపల్లె, 12న రామేశ్వరాపురం, సూగూరు, 13న యాపర్ల, సూగూరు, 16న తిప్పాయిపల్లె, ఈర్లదిన్నె, 17న పాతపల్లి, మునగమాన్‌దిన్నె, 18న చెలిమిల్ల, పెబ్బేరులో కార్యక్రమాలు నిర్వహిస్తారు. సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తాసీల్దారు కోరారు.

### డ్యూటీ డబ్బులు ఇవ్వండి మహాప్రభో

వడ్డేపల్లి, మే 31 : ప్రభుత్వం నిర్వహించిన ఆయా సర్వేలో ఎన్యూమరేటర్లుగా నిర్వహించిన ఉపాధ్యాయులకు నేటి వరకు డ్యూటీ డబ్బులు కూడా చెల్లించ లేదని, సర్టిఫికేట్లను కూడా అందజేయలేదని సీనియర్ ఉపాధ్యాయులు ఈశ్వరయ్య శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. సర్టిఫికేట్లు అందజేస్తే సీపీఎస్ డబ్బులు వస్తాయన్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవోకు మొరపెట్టుకున్నా స్పందించడంలేదని, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానన్నారు.